
1409




అట్టే అట్టే కదలకండి. అలాగే నిలబడిపోండి.... ఏ అదిలా—అలా ఇటుకేసి వోరకంటచూడండీ... శభాష్! సింప్లీ వండర్‌ఫుల్. అచ్చు బైస్కోపులో అమ్మళ్ళాగే ఉన్నారు. వెంకటేశం! అయాంమ్ ప్రౌడాఫ్ యువర్ సిష్టర్. చూడవోయ్ గార్బో, గాడర్డ్, డీట్రిక్ వీళ్ళంతా ఎందుకు నిషకొస్తారీ రూరల్ బ్యూటీముందు—కాంట్రాష్టు చూపెటడానిగ్గాకా? అసలు వాళ్ళకిలా ఈపటిన ఇంత అతిలోక సుందరి రాటవుతున్న ఆచూకీ తెలిస్తే మరో మకో మామ్మతో బైస్కోపు తీదురా అని. నో యవు కాంట్-

మిస్ బుచ్చమ్మ రాకపోతే మా కివన్నీ అనవసరం అని మానేద్దురు. అందుకేకదోయ్ నాలాంటి వాడింకా ఫీల్డులోకి జంప్ చెయ్యకుండా ఉన్నదీ.

ఎవడో ఒహాగుంటడూ, ఒహా గుంటని జతపడితే చాలునని ఎగబడి పిక్చర్లు తీసేదామని ముందుకు దూకేసే వాళ్ళున్నందువల్లనే గదటోయ్ ఈనాడు మరీ ఇంత గుంట తన పిక్చర్లు వొచ్చి పడిపోతున్నాయీ.

ఈ విషయమై రీసెంటుగా ఇంటర్నేషనల్ ఫిలిం సెమినార్లో "ది ఇలెవెన్ కాజెస్ ఫర్ ది డీజెనరేషన్ ఆఫ్ తెలుగూ సినిమా" అన్న సబ్జెక్టుమీద ఒఖ్ఖబిగిన నాలుగుఘంట లెక్చరిచ్చేసరికి అక్కడున్న యావన్మందిన్నీ డంగైపోయారు. మళ్ళీ వాళ్ళని మేల్కొలపడానికి స్మెల్లింగ్ సాల్టూ గట్రా పెట్టి నానాతంటాలూ పడవలొచ్చింది.

యస్. అసలే వెహిమెంట్ లెక్చర్. అసల్లెక్చరంటే నాకింక వొళ్ళుపై తెలీదు. మహా నిర్దాక్షిణ్యంగా యనలైజ్ చేసి ఈకక్కి ఈకా తోక్కి తోకా పీకి ఏకవతల పారేస్తాను. అఫ్కోర్స్. ఐనో... ఐనో.... నాకు తెలుసు కడుపుచించుకుంటే కాళ్ళమీదపడేనని, బట్ వాటుగాండూ? ....డ్యూటి ఫస్టన్నారుమరి.

చెప్పొచ్చినమాట. మరి ఆనాడలా ఘంకా బజాయించి లెక్చరిచ్చేసరికి మీటింగులో పోగైన యావన్మందిన్నీ విరగబడిపోయి గిరీశం డూమీదేం పిక్చరంటే డూమీదయే పిక్చరని కాళ్ళా వేళ్ళాబడ్డారంటే నమ్మండి. నే నొప్పుకుంటానా. ఛస్ వల్లకాదు పొమ్మన్నాను. పదరిండి

యాలోని ఓ మారుమూల కుగ్రామంలో వరల్డ్ బ్యూటీ ఒకటి రాటవుతోందోయ్ నాజమ్మల్లారా—ఆవిడని ఎక్స్ప్లాయిట్ చేస్తూ మాదోహ తెలుగూ బయస్కోపు తీస్తేగాని మరోహాటి—మీరు నిలువెత్తు ధనంపోసి నప్పటికిన్ని ఎడమచేత్తోకూడా ముట్టనోయ్ అని చెప్పేశాను.... బ్యూటీ ఫస్టన్నారు మరి.

పోనీ అయితే ఆవిణ్ణే హీరోయినుగా వేసుకుని తీసి పెట్టండి సార్ అని వాళ్ళంతా పాపం ప్రాధేయపడ్డారు. బట్ నో!... బుచ్చమ్మ ఈజ్ బ్యూటిఫుల్ తెలుగూగర్ల్, పైగా విడోకూడా. ఎప్పుడూ మడీ మడీ అంటూ ఇదవుతుంది, తెలుగుతప్ప మరోహభాష ఛస్తే మాటాడదు అని చెప్పాను.

మహా బాగలాగే కానీండి. ఆవిడ కసలు డైలాగే లేకుండా పిక్చరు తీదురుగానని బతిమాలారోయ్. ఆమాటా రైటే.

ది బర్నింగ్ ప్రోబ్లెం ఆఫ్ ఆల్ టైమ్స్—విడో మారియేజ్ మీద ఫస్టు పిక్చరు లాగవతల పారెయ్యొచ్చననిపించింది... ఎవరూ కరటకశాస్త్రులవారా? దయ చెయ్యండి. మీమాటే అనుకుంటున్నాం.

అబ్బే విడో మారేజస్—అనగా వితంతూద్వాహములు అను విషయమై ఒక పిక్చరు తీయమని హాలీవుడ్ దొరల కంపిణీ ఆఫరు పంపింది—టెన్ థౌజం డాలర్లమీద. డాలరంటే వరహా అన్నమాట. చూశారా వాళ్ళేదో మహా ముందుకుపోయారనుకుంటున్నాము. మనం వరహాలు వదలి

రూపాయిల్లెక్కలోబడి ఇంతకాలమాయె గాని వాళ్ళింకా వరహా వరహా అంటూనే పాకులాడుతున్నారు. విడో మారేజనూ అంతే. అక్కడా ఉంది ఈ ప్రాబ్లెము. బ్యూటిఫుల్ యంగ్ విడోస్‌ని చూసి గుండె తరుక్కుపోయి ఘొల్లున ఏడిసేవాళ్ళు అక్కడా ఉన్నారు. అక్కడేమిటి యెక్కడపడితే అక్కడే ఉన్నారు. ఇందుగల రందులేరని సందేహము వలదు .... నాచ్చి కొశ్చన్‌లాగే ఇదిన్నీ, యూనివర్సల్ ప్రాబ్లెమ్, ఆల్ టైమ్ ప్రాబ్లెమ్, విడోని పెళ్ళి చేసుకోడం యెప్పుడూ మానవుడికి ప్రాబ్లెమే గాదండీ . .... అందికే నేనీ సబ్జెక్ట్ తీస్కున్నాను మన పిక్చర్‌కి. దీన్ని ముందు మన మాతృభాషలో తీసి ఆ మీదట, మీదటికో పైయేటికో వరల్డు లాంగ్వేజస్ అన్నిటిలోకి డబ్ చేసి అవతల పారేస్తే ఇహ మీరు అప్పుడొచ్చిపడే వరహాలు దాచుకునిందికి అగ్గురారం భూవులన్నిటా మహాళ్ళు కట్టించీయాల్సిందే మరి--

అందికే నేను అహోరాత్రులు మొత్తుకుంటున్నాను. తమరు పాటిమట్టి దిబ్బలు రొండు తవ్వించి ప్రస్తుతానిక్కాస్త రొఖ్ఖం గాదాయించి విసిరేస్తే దాన్ని నేను మళ్ళీ లక్షల్లోకి తర్జుమా చేసి దాఖలు చేసుకుంటానని.

మట్టిని బంగారం చేస్తానన్నాడు వెనకటి కెవడో .... మట్టి ఓ పట్టాన బంగారమవుతుందండీ దాం దుంపతెగ--అందులో ఏ గిరీశం జీనియస్సో, ఏ కరటక శాస్త్రులుగారి సహృదయమో కల్తీ అయితే తప్ప. యిదిగో యిలాగే

మార్చుకోవాలి మరి. వెధవది ఎన్నాళ్ళు దున్ని దున్ని వడ్లమ్మి పోగేస్తే అయినట్టుటా—మరదే ఓ పిక్చరు తీసి పారేశాన్నాడండి, ఇహ చాలుబాబోయ్ అని మొత్తుకునే దాకా వస్తూనేవుంటుంది.

ఇదిగో ఈ ధర్మసూత్న్రం మా భావగారికి ఎన్ని సార్లు చెప్పబోయినా చెవినబెట్టారుగాదు. ధువంధువం లాడుతూ లేచ్చకార్క పోడవేంగాని మీ రైనా సహృదయులూ, సరసులూ నికా ర్సైన విలువలు తెలిసినవారున్నూ గాబట్టే ఇందులో స్వారస్యం లాభం పసిగట్టారు...... మరొహాళ్ళనై తే పురవేంసినా పట్టుబడుతుందంటారా? మీరే చెప్పండి. నేన్చబితే మళ్ళీ అడుగో గిరీశంగాడు ముఖస్తుతి చేశాడేమిటి చెప్మా ఎన్నడూ లేనిదీ—అనుకుంటారు. మీరే చెప్పండి నా ఉద్యమంలో ప్రాశ స్త్యం మీక్భారుకుడుబడ్డట్టు మరొహ వానరమానవుడికౌనా అని... నిన్న చెప్పినట్టు మీరు, వారు ఆలోచించుకొని ముందర సాదరుఖర్చుల కీ,కంపెనీకి బిగివింగుకీ కొంతరొఖం జతపరి స్తే నేనూ, వెంకటేశం స్క్రిప్టుమీద కూచుంటాం. అంతే ఆనక మీరిస్తానన్నా ముట్టుకోం. కాండబ్బుకూడా కద పొద్దు. కదిపితే నామీదొట్టు, డిస్ట్రిబ్యూటర్లే లారీల మీద తోలించుకొస్తారండీ డబ్బు. అన్నట్టు మర్చిపోయా. వెధవది నేనీ మామూలు విలేజిలో ఇలా ఆలోచన చేస్తున్నట్లపుడే పాక్కిపోయింది దేశమంతా. అప్పుడే న్యూసు పేపరువాళ్లు పబ్లిసిటీ ఆరంభం చేశారు. చిత్తగించండి... అరే. వెళ్ళిపోతున్నా రేం?

డామిట్, మరీ ఇడియట్ లాగున్నాడే మా సూవం! వెంకటేశం నోట్‌బుక్ తీసి రాసుగో... రాసుగో చెప్తా. ది ఇలెవన్ కాజెస్ ఫర్ ది డిజెనరేషన్ ఆఫ్ తెలుగూ సినిమాలో పదకొండున్నూ... వన్, టూ, త్రీ, ఫోర్, ఫైవ్, సిక్స్, సెవెన్, ఎయిట్, నైన్, టెన్—అండ్ దెన్ నెంబర్ ఇలెవన్ ........ఏవైతేనేంలే ఇప్పటికిది చాలు.

ఆర్టిస్టులు మూడ్ ఫీడ్ చేయడానికి డబ్బు కోరగా ఇవ్వకపోవడం మోస్టింపార్టెంట్ రీజన్ అని—

అరె! మిస్ బుచ్చమ్మకూడా చక్కా పోతోందే— శాడ్ సీన్‌లో హీరోయిన్‌లా ఫేసు పెట్టి!

డామిట్, ఒక్క దెబ్బకి రెండు పిట్టలెగిరిపోయాయి!

